భద్రగిరీశునికి నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 21: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రంలో బుధవారం భద్రగిరీశునికి అర్చకులు నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామి వారికి సుప్రభాతం పలికారు. ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి నిత్య కల్యాణమూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పునర్వసు పూజలు

పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఉత్సవ మూర్తులకు బేడా మండపంలో సహస్ర ధారలు, తులసి మాలలు, గండకీశిలలతో అభిషేక తిరుమంజనం జరిపారు. సాయంత్రం పునర్వసు సేవ, రాత్రికి చుట్టు సేవ నిర్వహించారు.

నేడు అంకురార్పణ

సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం ఏకోత్తర శత సహస్ర కలశాభిషేకానికి అర్చకులు అంకురార్పణ నిర్వహించనున్నారు. అందులో భాగంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వెండి బిందెలో పవిత్ర గోదావరి తీర్థాన్ని తీసుకొచ్చి యాగశాలలో అంకురార్పణ చేస్తారు.

పర్ణశాల రామయ్యకు పునర్వసు కల్యాణం

పర్ణశాల, ఫిబ్రవరి 21: పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అర్చకులు బుధవారం పునర్వసు కల్యాణం నిర్వహించారు. ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, పరిచారకులు భరత్‌కుమారాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

టేకులపల్లి, ఫిబ్రవరి 21 : యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య ప్రీమియర్ లీగ్ ఫైనల్‌లో కేకే కేఎస్ఆర్ కోయగూడెం, ఏజే11 సంపత్‌నగర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సంపత్‌నగర్ విజేతగా నిలిచింది. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు సైదా రవూఫ్, శ్రీకాంత్, నాయకులు కోరం సురేందర్, బోడ సరిత, బోడ మంగీలాల్, మూడ్ గణేశ్, అఖిల్, సర్దార్, రవి పాల్గొన్నారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి, శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయాల్లో వచ్చే నెలలో జరిగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆలయాల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక శివాలయంలో ఉత్సవాల నిర్వాహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు కోసం గ్రామస్తులు, భక్తుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయాల్లో ఉత్సవాల నిర్వాహణకు ఉత్సవ కమిటీని నియమించడం జరుగుతుందని, త్వరలోనే అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఉత్సవాలకు ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపారు. తొలుత శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగించండి

చంద్రుగొండ, ఫిబ్రవరి 21: గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కొనసాగించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, జడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చొరవతో మంజూరైనా సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. గతంలో చేసిన పంచాయతీ తీర్మానాలను యథావిధగా కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు కొందరూ గతంలో చేసిన తీర్మానాలను తమకు అనుకూలంగా మార్చుకొని, పనులు తమ పేరునా మార్చుకుంటున్నారని, అటువంటి చర్యలు మానుకోవాలన్నారు. ఎంపీటీసీలు దారవెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాభాల గని కొబ్బరి

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 21 : కొబ్బరి సాగు లాభాల గని అని అటువంటి సాగును తెలంగాణ వ్యాప్తంగా విస్తరించేందుకు రైతులు కృషి చేయాలని, సాగు విస్తరణకు కేంద్ర కొబ్బరి బోర్డు కృషి చేస్తున్నదని తెలంగాణ కొబ్బరి రైతుల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామ్‌మోహన్ అన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లాల కొబ్బరి రైతుల సమావేశం పట్టణంలోని రైతువేదికలో జరిగింది. ఈ సమావేశానికి కొబ్బరి బోర్డు అధికారులు, స్థానిక వ్యవసాయ, అగ్రికల్చరల్ అధికారులు పాల్గొని సాగులో అధిక దిగుబడులను సాధించేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ముందుగా ఆలపాటి మాట్లాడుతూ.. విజయవాడ కేంద్రంగా రైతులకు అధికారులు సేవ చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య, నున్నా నాగేశ్వరావు, శీమకుర్తి వెంకటేశ్వరావు, అధికారులు సందీప్, వై నవీన్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో 'బ్రిలియంట్' ప్రతిభ

సారపాక, ఫిబ్రవరి 21 : సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థినులు ఎస్‌కె. ఆషిఫా, పీఎస్ ఉజ్జయిని, టి.భవ్య, బి.హర్షిత, వి.సాయి సంతోషి, బి.భవ్య, ఎం.సాత్విక, బి.సాయినాథ్ మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి అత్యంత ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ బుధవారం తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను సారపాక ప్రధాన సెంటర్ నుంచి మేళతాళాలతో పాఠశాల వరకు పూలుచల్లుతూ ఊరేగించారు. కార్యక్రమంలో బ్రిలియంట్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 21: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు హెచ్ఎం ఏవీ రామారావు, ఉపాధ్యాయులు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంతఈవో సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పాఠశాల పేరు నిలబెట్టాలని కోరారు. సమావేశంలో ఎస్ఎంసీ సభ్యులు హుస్సేన్ అహ్మద్, సరిత, యలమంచి శ్రీనుబాబు, బైరెడ్డి, సతీష్, నక్కా సత్యనారాయణ, నర్సింహారావు పాల్గొన్నారు.

తెలంగాణ కుంభమేళాకు జన జాతర

మణుగూరు టౌన్: గడ్డెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఇల్లెందు రూరల్: వనదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 21: తెలంగాణ కుంభమేళా మేడారం జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలి వెళ్తున్నారు. బుధవారం నుంచి ఈ నెల 24 వరకూ మేడారంలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరలో పాల్గొనేందుకు, అమ్మవార్లను దర్శించుకునేందుకు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తజనులందరూ కుటుంబ సమేతంగా కదిలి వెళ్తున్నారు. మేడారం మార్గంలో గడిచిన రెండు రోజులుగా భక్తుల రద్దీ అమాంతం పెరిగింది. కాగా, మేడారం వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో ఆ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణం భక్తులతో కిక్కిరిస్తోంది. కాగా, మేడారం వెళ్లే భక్తులకు ఆర్యవైశ్య సంఘం బాధ్యులు కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు. మేడారం జాతర బుధవారం నుంచి మొదలు కావడంతో పట్టణంలోని రామాటాకీస్ ఏరియాలో ఉన్న గడ్డెల వద్ద బుధవారం రాత్రి సందడి నెలకొంది. మినీ మేడారాన్ని తలపించే విధంగా వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గడ్డెపైకి చేరిన సారలమ్మ తల్లిని దర్శించుకున్నారు.

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 21: మండలంలోని తోగ్గూడెంలో మినీమేడారంగా పేరుపొందిన శ్రీసమ్మక్క-సారలమ్మ వనదేవతల జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. భక్తుల సౌకర్యార్థం సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా సహకారంతో ఆలయకమిటీ చైర్మన్ ఊకే వీరయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండే మెలుగుట కార్యక్రమంతో ప్రారంభమైన జాతర సమీపంలోని రథంగుట్ట నుంచి అటవీ మార్గంలో మేళతాలాలు, నృత్యాలు, ఆదివాసీల సంప్రదాయాల నడుమ సారలమ్మను బుధవారం గడ్డెల వద్దకు చేర్చారు. గురువారం సమ్మక్క తల్లి ఆలయం గడ్డెల వద్దకు చేరుకొని భక్తుల పూజలు అందుకున్న తర్వాత 24న వనత దేవతలు వన ప్రవేశం చేయనున్నారు. మినీమేడారం జాతరలో పర్సిక రాజమ్మ ప్రధాన పూజారిగా వ్యవహరిస్తుండగా.. సహాయ పూజారులుగా పర్సిక గోపమ్మ, మడకం ఇర్మయ్య వ్యవహరిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం మణుగూరు తహసీల్దార్ మినీమేడారం జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మణుగూరు ఆర్యవైశ్యసంఘం, వాసవీక్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని సంజయ్‌నగర్ కార్మిక వాడల్లో కొలువు దీరిన సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు బుధవారం సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. జాతర కార్మిక వాడలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్‌వోటు జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీ.వి.మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు డేరంగుల పోశం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని బొజ్జాయిగూడెం ఆటవీ సమీపంలోని సామ్మక్క-సారలమ్మకు మొదటి రోజు భక్తులు నీరాజనాలు పలుకుతున్నారు. బుధవారం అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు సూదర ప్రాంతాల నుంచి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ, పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

చదువే శాశ్వత ఆస్తి

బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21 : విద్యార్థుల చదువు వారి భవిష్యత్‌కు శాశ్వత ఆస్తి అని, ఎంత పంచిన తరగనిది విద్య మాత్రమేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రుల ఆశయాలు, లక్ష్యాలను చేరుకునే విధంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. నిరుపేదలకు సైతం నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిచ్చిందని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యూఎస్ ప్రకాశ్ రావు అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సాగర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష దినోత్సవం

అశ్వారావుపేట టౌన్/చంద్రుగొండ, ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్ నేమాల ఉషారాణి తల్లి, బిడ్డల ప్రేమానురాగాలను తెలుపుతూ చిత్రం గీసి చిన్నారులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. పెద్దలు సైతం టీచర్ చూపుతున్న శ్రద్ధను అభినందించారు. ఈ వేడుకలకు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధిస్తేనే ఇతర భాషాలపై అవగాహన లభిస్తుందని హెచ్ఎం క్రిష్ణకుమారి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్/ లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 21: తెలుగు ప్రజలం ప్రపంచంలో ఎక్కడ ఉన్నా అందరమూ మన మాతృభాష అయిన తెలుగులోనే మాట్లాడుకుందామని సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని లక్ష్మీదేవిపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మేకల జ్యోతిరాణి ఆధ్వర్యంలోనూ బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవుల వేషధారణలు, ఫ్యాన్సీ డ్రెస్‌లు, ఆటలు, పాటలతో విద్యార్థులు అలరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21 : మాతృభాష లేకుండా జాతి మనుగడ కోల్పోతుందని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కొన్ని భాషలు అంతరించిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సాహితీవేత్త డా.సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ.. మాతృ భాషపై పట్టు సాధిస్తే ఏ భాషలోనైనా రాణించవచ్చన్నారు.

'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోకి చర్ల విద్యార్థులు

చర్ల, ఫిబ్రవరి 21: మండలంలోని శ్రీ గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు 'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించారు. అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యాలయం ఆవరణలో బుధవారం పద్య పఠన కార్యక్రమాన్ని విద్యాలయం నిర్వాహకులు నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులు 110 మంది.. ఒకొక్కరు ఒక్కోటి చొప్పున, తెలుగు భాషా శతకంలోని 110 పద్యాలను 16 క్షణాల్లో భావయుక్తంగా చదివారు. ఈ శతకాన్ని చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించారు. ఈ కార్యక్రమాన్ని 'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' ప్రతినిధి వడుగు నాగపద్మిని పరిశీలించారు. విద్యార్థులను అభినందించి, 'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం పొందినట్టు ప్రకటించారు.

మావోయిస్టుల స్థావరం ధ్వంసం

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 21: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేత, దళ కమాండర్ వెల్లే సంచరిస్తున్నట్లు సమాచారం అందుకున్న అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు బుధవారం ఇరు జిల్లాల భద్రతా దళాలతో సెర్చింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. జవాన్లు పిడియా హిత్వేర్ అటవీప్రాంతంలోకి ప్రవేశించగానే మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులు ప్రారంభించాయి. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పరారయ్యారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కొంత పేలుడు సామగ్రితో పాటు మావోయిస్టులకు సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలానికి సమీపంలో మావోయిస్టులు బస చేసేందుకు ఏర్పరుచుకున్న స్థావరాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఎదురుకాల్పుల్లో కొందరు మావోయిస్టులు గాయపడి ఉండొచ్చని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. అధికారికంగా ప్రకటించలేదు.

ఓటరుగా నమోదు చేయించండి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21 : అర్హత గల ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని రాజకీయ పార్టీలకు జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నాయకులతో తుది ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హత గల యువత ఓటు నమోదు చేయించుకోవడమే కాకుండా ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని కోరారు. నయాబ్ తహసీల్దార్ లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

జూలూరుపాడు, ఫిబ్రవరి 21: ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా షేడ్‌నెట్లు ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షించాలని డీఆర్‌డీవో విద్యాచందన సూచించారు. మండలంలోని మాచినేనిపేటతండా పంచాయతీ నర్సరీని బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఏపీవో డీ.రవి, కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించం

రామవరం, ఫిబ్రవరి 21: అభివృద్ధి పనులు నాణ్యంగా ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని రామవరం ఏరియా 7, 10 వార్డుల్లో రూ.కోటి డీఎంఎఫ్ నిధులతో నిర్మించనున్న ప్రధాన రహదారుల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్య క్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాక్కి, కమిషనర్ శేషాంజన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 21: మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జక్కుల సుందర్‌రావు, శేషాద్రి వినోద్, కోరం చంద్రశేఖర్, రజాక్, ఇక్బాల్, మున్నీర్, కనకరాజు, పుట్టిరవితేజ, కర్కపల్లి సుధీర్, మురళి పాల్గొన్నారు.

సింగరేణిలో 17 మంది అధికారుల బదిలీ

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 21: సింగరేణి మైనింగ్ విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ జీఎం, అడిషనల్ జీఎం, కాలరీస్ మేనేజర్ అధికారులు 17 మందిని బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరాంపూర్‌లో అడిషనల్ జీఎంగా ఉన్న కందల రఘుకుమార్‌ను ఆర్జీ రీజియన్‌కు, అడ్రియాలా ప్రాజెక్టు అడిషనల్ జీఎం దెబ్బులాల్ బైద్యను ఆర్జీ1కు, శ్రీరాంపూర్ ఎస్ఆర్‌పీ వోసీ2లో డీవైజీఎంగా ఉన్న పురుషోత్తంరెడ్డిని అదే ఏరియాకు, సింగరేణి భవన్‌లో డీవైజీఎంగా ఉన్న తాడెబోయిన శ్రీనివాస్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీ చేశారు. ఆర్జీ1 ఏరియా డీవైజీఎం బండి సత్యనారాయణను ఏఎల్‌పీకి, ఆర్జీ1 డీవీఐజీఎం శ్రీధర్‌ను శ్రీరాంపూర్ ఆర్‌కే 7కు, శ్రీరాంపూర్ ఆర్‌కే7లో డీవైజీఎంగా ఉన్న సాయిప్రసాద్‌ను ఆర్జీ1కు, మందమర్రి ఏరియా డీవైజీఎం వెంకటేశ్వర్లును శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీ చేశారు. హైదరాబాద్‌లో ఎస్‌వోఎంగా ఉన్న బ్రహ్మాజీరావును శ్రీరాంపూర్‌కు, శ్రీరాంపూర్‌లో కాలరీ మేనేజర్‌గా ఉన్న సుధీర్ జయవంతరావును మందమర్రికి, ఏరియా ఎస్అండ్‌పీసీఅడిషనల్ మేనేజర్‌రమణారెడ్డిని మణుగూరుకు, హైదరాబాద్‌లో అడిషనల్ మేనేజర్ మహేందర్‌రెడ్డిని ఆర్జీ ఏరియాకు, కొత్తగూడెం ఏరియా అడిషనల్ మేనేజర్ జర్పుల శంకర్‌ను అదే ఏరియాకు, మణుగూరు ఎంవీటీసీ అడిషనల్ మేనేజర్ లక్ష్మణ్‌ను అదే ఏరియాకు, కార్పొరేట్ డిప్యూటీ మేనేజర్ సునీల్‌కుమార్‌ను మణుగూరు పీకేవోసీకి, మందమర్రి ఏరియాకు డిప్యూటీ మేనేజర్ బూడిద జయంత్‌కుమార్‌ను అంద్రియాలా ప్రాజెక్టుకు బదిలీ చేశారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 21 : సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పార్క్‌లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ బుధవారం ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ సీతాలక్ష్మికి సన్మానం

సీతాలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 21: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అవిశ్వాసంలో నెగ్గి మొదటిసారి బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని పలువురు కౌన్సిలర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. గజమాలతో చైర్‌పర్సన్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌన్సిలర్లు న్యాయం వైపే నిలబడ్డారని, దాని ఫలితంగానే అవిశ్వాసంలో నెగ్గి మళ్లీ చైర్‌పర్సన్‌గా కార్యాలయానికి వచ్చానని అన్నారు. సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ వద్దిరాజును కలిసిన 'కోనేరు'

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 21: రాజ్యసభ సభ్యుడిగా బీఆర్ఎస్ తరపున మరోసారి ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో వద్దిరాజు నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.

ఆదివాసీలకు అండగా పోలీస్ శాఖ

చర్ల, ఫిబ్రవరి 21: ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఆదివాసీ గ్రామమైన కిష్టారంపాడు వాసులకు నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టులకు సహకరించవద్దని కోరారు. సీఐ రాజువర్మ, ఎస్సైలు టివిఆర్.సూరి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

డీసీవోకు సన్మానం

చుంచుపల్లి, ఫిబ్రవరి 21: జిల్లా సహకార శాఖ అధికారి (డీసీవో)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సయ్యద్ ఖుర్షీద్‌ను సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని డీసీవో కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా కప్పి సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ సుబ్బారావు, కొత్తగూడెం సంఘం సెక్రటరీ పండ్ల సారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాగి నడపొద్దు.. ఇంటోళ్లను ఏడిపించొద్దు

భద్రాచలం, ఫిబ్రవరి 21: మద్యం మత్తులో వాహనం నడిపి.. ప్రమాదాన పడి.. ప్రాణాల మీదకు తెచ్చుకుని.. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, తోబుట్టువులను ఏడిపించొద్దని వాహన చోదకులకు ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ విజ్ఞప్తి చేశారు. డంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన బు ధవారం 30 మంది డ్రంకెన్ డ్రైవర్లకు వారి కు